
ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 31, జనవరి 2026


# మండల అభివృద్ధికి కృషి చేసా

## కలెక్టర్ రాజర్షి షా



**నార్నూర్, జనవరి 30, ప్రభాతవార్త:** గాదిగూడ మండల అభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలోని అర్జుని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. గ్రామస్థులు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. మండలంలోని గ్రామాల్లో నీటి సమస్యలు తీర్చుటకు చర్యలు తీసుకుంటామన్నారు. భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కవితల పోటీలో బహుమతి గెలుపొందిన కొలమా బుద్ద గూడ పాఠశాలకు చెందిన విద్యార్థి కాంబ్లె రిశాంక్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం మండలంలోని కుండి గ్రామంలో నూతనంగా నిర్మించిన రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈవో రమేష్, పాఠశాల హెడ్ మాస్టర్ మెస్రం శేఖర్, సర్పంచ్ కమల బాయి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాస్ పుస్తకాల జారీలో తీవ్ర జాప్యం..

# రైతుల్లో ఆందోళన

- భూభారతి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు సజావు..
- ముద్రణ నిలిచిపోవడంతో వేలల్లో పెండింగ్
- రైతు భరోసా-బీమా లబ్ధికి అడ్డంకి
- ఏడాది దాటినా చేతికిరాని పాస్ పుస్తకాలు
- ప్రింటింగ్ ఆర్డర్ రీన్యువల్ ఆలస్యం కారణమా?
- జిల్లాలో వేల సంఖ్యలో నిలిచిన పాస్‌బుక్‌లు



**చింతలమానేపల్లి, జనవరి 30, ప్రభాతవార్త:** ధరణి వ్యవస్థను రద్దు చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూభారతి వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానం ద్వారా వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్‌లు, ఇతర భూ లావాదేవీలు ఆన్‌లైన్‌లో సులభంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రిజిస్ట్రేషన్ పూర్తైన కొన్ని రోజుల్లో రైతుల ఇంటి వద్దకే పట్టా పాస్ పుస్తకాలు చేరేలా నిబంధనలు రూపొందించారు. అయితే గత ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు పాస్ పుస్తకాల ముద్రణ నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు సజావుగా సాగుతున్నప్పటికీ, పాస్ పుస్తకాల ప్రింటింగ్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

2లో..

# కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



**ఆసిఫాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని కొమురం భీం ఆసిఫాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను జిల్లా కలెక్టర్ కె హరిత రాజ్యస మండలాధికారి లోకేశ్వర్ రావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి విధుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన ఎన్నికల వ్యయంను లెక్కించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి వై సంపత్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ పాల్గొన్నారు.

# నిందితున్ని కఠినంగా శిక్షించాలి





**దహెగాం, జనవరి 30, ప్రభాతవార్త:** దహెగాం మండలంలోని బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగూడ గ్రామంలో బుధవారం మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన తెలిసిందే, ఆత్మకూరి కళావతి(35)ని అదే గ్రామానికి చెందిన వగాడే బడేరాం హత్య చేశారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని శుక్రవారం ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్తులు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు నిందితునికి కఠినంగా శిక్ష పడేలా చర్య తీసుకుంటాని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సిఐ వెంట ఎస్సై సందీప్ కుమార్, దహెగాం ఎస్సై విక్రమ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### కొంగ సత్యనారాయణ మద్దతు

హత్యకు గురైన కళావతి కుటుంబానికి న్యాయం జరగాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చేస్తున్న ధర్నాకు కొంగ సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కళావతి విచక్షణంగా హత్య చేసిన హంతకున్ని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబానికి 50 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పాస్ పుస్తకాల జారీలో తీవ్ర జాప్యం..

మొదటి పేజీ తరువాయి..

ప్రింటింగ్ ఏజెన్సీకి సంబంధించిన ఆర్డర్ రెన్యువల్ జరగకపోవడమే ఈ జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పాస్ పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. జిల్లాలోనే సుమారు 3 వేల వరకు పాస్ పుస్తకాలు ముద్రణ కాక నిలిచిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఫిజికల్ కాపీ లేక రైతులకు తప్పని ఇబ్బందులు.

పాస్ పుస్తకాల ఫిజికల్ కాపీలు అందకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా డిజిటల్ కాపీలపై ఆధారపడాల్సి వస్తోంది. అత్యవసర అవసరాల కోసం డిజిటల్ పాస్ పుస్తకాలను వినియోగించుకోవచ్చని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంత రైతులు ఫిజికల్ కాపీ చేతిలో ఉంటేనే పూర్తి భరోసా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. కేవలం డిజిటల్ రికార్డులపై ఆధారపడటం వల్ల బ్యాంకులు, సహకార సంఘాలు, ఇతర కార్యాలయాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల డిజిటల్ కాపీలను పూర్తిస్థాయిలో అంగీకరించకపోవడంతో తిరిగి తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రుణాల మంజూరుకు అడ్డంకి. సాగు పనులు ఆలస్యం..

పాస్ పుస్తకాలు లేకపోవడం వల్ల ముఖ్యంగా కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందడంలో, వ్యవసాయ యంత్రాలు కొనుగోలు చేయడంలో పాస్ పుస్తకం కీలకంగా ఉండటంతో రుణాలు మంజూరు కావడం ఆలస్యమవుతోంది. దీంతో సాగు పనులు కూడా వెనకబడుతున్నాయని రైతులు వాపోతున్నారు. అదే విధంగా రైతు భరోసా, రైతు బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందడంలో కూడా పాస్ పుస్తకం అవసరం కావడంతో అనేక మంది రైతులు ఈ పథకాల నుంచి దూరమవుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికే పెరిగిన సాగు ఖర్చులు, విత్తనాలు, ఎరువుల ధరల భారం ఒక వైపు ఉంటే, మరోవైపు పాస్ పుస్తకాల జాప్యం రైతులను మరింత కుంగదీస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

### పెండింగ్ పాస్ బుక్‌లు తక్షణమే ముద్రించాలని ప్రభుత్వానికి వినతి..

పాస్ పుస్తకాల జారీ ప్రక్రియలో నెలకొన్న ప్రతిష్టంభనను వెంటనే తొలగించి, పెండింగ్‌లో ఉన్న పాస్ పుస్తకాలను అత్యవసర ప్రాతిపదికన ముద్రించి పంపిణీ చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రింటింగ్ ఏజెన్సీ ఆర్డర్‌ను తక్షణమే రెన్యువల్ చేసి, ముద్రణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాస్ పుస్తకాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

**రిజిస్ట్రేషన్ పూర్తైనా పాస్ బుక్‌లు లేవు.**

గత ఐదు నెలలుగా భూముల రిజిస్ట్రేషన్ పూర్తయినప్పటికీ పట్టా పాస్ పుస్తకాలు అందక రైతులు పంట రుణాలు, లోన్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న పాస్ పుస్తకాలను ముద్రించి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అందజేయాలని వారు కోరుతున్నారు.

**రైతు శంకరయ్య, గ్రామం కర్జవెల్లి**

# రేపు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

**సిరికొండ, జనవరి 30, ప్రభాతవార్త:**



సిరికొండ మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో వచ్చే నెల 1న సనాతన ధర్మ సమితి రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని శివాలయ కమిటీ అధ్యక్షుడు ముత్యపు శివశంకర్ తెలిపారు. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు గ్రామంలోని పురవీధుల గుండా శివపార్వతుల విగ్రహ మూర్తుల పల్లకి ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీశ్రీశ్రీ సంత్ నారాయణ మహారాజ్ ఆధ్వర్యంలో సనాతన సేవా సమితి ప్రవచన కార్యక్రమం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తారు. కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ప్రతి కాలనీలో మహిళలు గడపగడపకు తిరుగుతూ మహిళలకు కుంకుమ బొట్టు పెడుతూ ఈ కార్యక్రమానికి ఆహ్వానం పలికారు. అలాగే సమితి సభ్యులు మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం చేసి ఫిబ్రవరి 1న మండల కేంద్రంలో నిర్వహించే సనాతన ధర్మ సేవా సమితి సమ్మేళనం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి ప్రజలను ఆహ్వానిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 1న జరిగే సమ్మేళనం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముత్యపు శివశంకర్ కోరారు.



# పారిశుధ్యం, త్రాగు నీరుపై ప్రత్యేక దృష్టి



### సర్పంచ్ కుమర మాహాదు

**నార్నూర్, జనవరి 30, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని నాగలకొండ గ్రామ పంచాయతీ ప్రాంగణంలో శుక్రవారం నూతన సర్పంచ్ కుమర మాహాదు అధ్యక్షతన కార్యదర్శితో కలసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థలో భాగంగా గ్రామ అభివృద్ధి, పారదర్శకత, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన కీలక సమావేశమే గ్రామ సభ అని సర్పంచ్ కుమర మాహాదు అన్నారు. ప్రతిజ్ఞతో ప్రారంభమైన గ్రామ సభలో పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని పారిశుధ్య, డ్రైనేజీ, మురికి కాలువలు, త్రాగు నీరు, ఉపాధి, విధ్య, వైద్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానాని అన్నారు. జిల్లాలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చి దిద్దుతానని ఎమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని గ్రామ వార్డు మెంబర్‌లను, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్ర మాహదు, కార్యదర్శి లక్ష్మీ ప్రియ, ఉపసర్పంచ్ షేక్ అసద్, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, వార్డు మెంబర్లు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత అవగాహన సదస్సు




**బజార్‌హత్నూర్, జనవరి 30, ప్రభాతవార్త:**

మండలంలోని డెడ్రా గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత గురించి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ బ్యాంక్ నియమ నిబంధనల గురించి, డ్వాక్రా మహిళా సంఘాల పొదుపు, ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియం, రైతుల క్రాప్ లోన్స్, ఏల్టి లోన్స్, గోల్డ్ లోన్, గృహ లోన్స్ తదితర అంశాలపై గ్రామ ప్రజలకు వివరించారు. బ్యాంకు చట్టాలపై, పాలసీ లోపాలు, వాటి వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. ఇందులో భాగంగా సైబర్ క్రైమ్ గురించి ఓటీపీల గురించి ప్రజలు ఉండాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఎం రాజ్ కుమార్, డెడ్రా గ్రామ సర్పంచ్ కుడుమేత విజయ, గ్రామ పటేల్ కుడుమత లింగు, బ్యాంకు సబ్‌ఆర్డినేటర్ ఏ నరేష్, కళాజాత బృందం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

**బజార్‌హత్నూర్, జనవరి 30, ప్రభాతవార్త:**

ప్రతీ ఒక్కరు పౌర హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలి అని తహసిల్దార్ శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఒకరికి ఒకరు మధ్య ప్రేమ ఆప్యాయత ఉండాలని, ఎటువంటి వివక్ష ఉండకూడదని, గ్రామ ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరు పౌర హక్కుల చట్టాన్ని అమలుకు సహకరించాలన్నారు. ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న వివక్ష రూపుమాపాలంటే ప్రతి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం ప్రతి పౌరుడికి అవగాహన చేయాలన్నదే, డివిఎంసి మెంబర్ల ముఖ్య ఉద్దేశం అని, జిల్లా డివిఎంసి మెంబర్ మెస్రం జంగుబాపు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరచ సాయన్న, పిఏసిఎస్ డైరెక్టర్ వినీల్, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.



# మా ఊరు బడి మా పిల్లల భవిష్యత్తు

**సారంగాపూర్, జనవరి 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని కంకేట గ్రామంలో పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఒక విద్యా వాలంటీర్లను, పదవ తరగతి పిల్లల కోసం ఒక ట్యూటర్ని నియమించారు. గ్రామ ఉద్యోగులు, సర్పంచ్ సిద్ధికర్ సాహెబ్ రావు, జబ్బర్‌తో కలిసి నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మా గ్రామ పాఠశాలలను కాపాడుకోవడం, అందులో చదువుతున్న విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందుకు పాఠశాల పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## గాంధీజీ ఒక వ్యక్తి కాదు.... ఒక వ్యవస్థ

**ఆసిఫాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :**

జాతి పీత మహాత్మా గాంధీజీ ఒక వ్యక్తి కాదని, ఒక వ్యవస్థ అని వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ్ బాబు పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి పురస్కరించుకొని శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక గాంధీ చౌక్ లో వాసవి ఇంటర్నేషనల్ సభ్యులు ఎక్కిరాల శ్రీనివాస్, టీవీ నంది పురస్కార గ్రహీత నాగబాల సురేష్ తో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒకరు గాంధీజిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు, హింస మార్గాన్ని విడనాడి అహింసా మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని కోరారు. ఆయన సిద్ధాంతాలను, ప్రజలకు చేసిన సేవలు మరొకసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, మాజీ అధ్యక్షులు కోడిప్యాక వేణుగోపాల్, సాయిని సంతోష్, సభ్యులు కాచం ప్రకాష్, టి.గిరీష్, జి.వినేష్,జి.ప్రమోద్, కాచం వినేష్, జి.వేణుగోపాల్, ఆర్ మురళి, గోగుల శ్రీనివాస్, విశ్వేషర్, బి. మురళి, రాజు, వెంకన్న పాల్గొన్నారు.



గాంధీజీ కి నివాళులు అర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

## కూలీలకు ప్రతి ఒక్కరికి పని అందేలా చూస్తా

**ఉట్నూర్, జనవరి 30, ప్రభాతవార్త :**

మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో గంగన్నపేట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి పనిని లక్కారం గ్రామ సర్పంచ్ అజ్మీరా రేణుక పర్యవేక్షించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతు కూలీలకు ప్రతి ఒక్కరికి పనులు అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు జయచంద్ర, ఉపాధి సిబ్బంది పీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్,దూట మహేందర్ తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ పనిని పర్యవేక్షణ చేస్తున్న సర్పంచ్ అజ్మీరా రేణుకా

### ఎంపీడీవో ఆధ్వర్యంలో

## సర్పంచుల సమావేశం

**లింగాపూర్, జనవరి 30, ప్రభాతవార్త :**

మండలంలోని సర్పంచులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో లింగాపూర్ సర్పంచ్ జాదవ్ రాజశేఖర్ మాట్లాడుతూ వేసవికాలంలో ఏర్పడే నీటి సమస్యలు ఏర్పడకుండా చూడాలని అధికారులను కోరారు. అదేవిధంగా ఉపాధి హామీ పనులు మరియు వాటికి సంబంధించిన డబ్బులు సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర హౌసింగ్ ఏఈ శశికాంత్ ఏపీఎం సూర్య కాంత్ తోపాటు మండలంలోని సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జాదవ్ రాజశేఖర్

# పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలి

**ఆసిఫాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:**

పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు . శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనక్కాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి, బోధనా తీరుపై విద్యా ప్రమాణాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని బడికి రప్పించాలని అన్నారు పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రణాళికలు రూపొందించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన, పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన బోధన అందించాలని అన్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, వారిని మానసికంగా సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కె. హరిత

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి... ఎంపిడిఓ ఆల్బర్ట్

**పెంచికల్ పేట్, జనవరి 30, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండలంలోని దరోగపల్లి, చేడ్వాయి, పొతేపల్లి, బొంబాయిగూడ, గ్రామ పంచాయతీల్లో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపిడిఓ ఆల్బర్ట్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యటన చేపట్టిన ఆయన, పనులు వేగవంతంగా పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా అంగన్వాడీ టాయిలెట్లు, తొమ్మిది వీఓ భవనలు, రెండు గోడౌన్ భవనాలకు మంజూరు లభించినట్లు తెలిపారు. వీటి పనులు వెంటనే ప్రారంభించాలని అదేశించారు. అలాగే గతంలో మండలానికి మంజూరైన 11 కిచెన్ షెడ్లు, 12 గర్ల్స్ టాయిలెట్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మధుకర్, జయశ్రీ, రాకేష్, నరేష్ పాల్గొన్నారు.



### అభివృద్ధి పనులపై

## అవగాహన సదస్సు

**కెరమెరి, జనవరి 30, ప్రభాతవార్త :**

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్ పంచాయితీ కార్యదర్శులకు గ్రామపంచాయతీ అభివృద్ధి పనులు ఇందిరమ్మ ఇండ్లు సమైక్య భవనాలు, ఇంటిపనులు పారిశుద్ధం పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సమావేశం ఏం.పి.ఓ సాయిరాం ఏపిఎం, ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఉపసర్పచ్ పాల్గొన్నారు.



ఎంపీడీఓను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

## బాలికల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి....



మాట్లాడుతున్న కలెక్టర్ కె. హరిత

**ఆసిఫాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:**

బాలికల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా అభివ్రుది, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవము కార్యక్రమ వేడుకల్లో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలను రక్షించుకుందాం, చదివిద్దాం, ఎదుగునిద్దామని, దీనిలో భాగంగానే ఖిబేటీ బచావో బేటీ పడావోఖీ కార్యక్రమము చేపడుతున్నదన్నారు. బాలికలు తమకు లభించిన సౌకర్యాలను ఉపయోగించుకొని భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని, విద్యతో పాటు తమకు తాము ఎంచుకున్న రంగాలలో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలకు వ్యాస రచన, పాటల పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. అనంతరం బాలికలు ప్రదర్శించిన సాంప్రదాయ కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేష్, అధికారులు శకుంతల, సిద్ధిక్, జిల్లా గిరిజన క్రీడల సంక్షేమ శాఖాధికారి మడవి న్నశబు, జిల్లా మహిళా సాధికారిత సమన్వయికర్త శారద , సభ్యులు, రాణి మమతా సఖి సిబ్బంది, బాలికలు ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు

## సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

జన్నారం, జనవరి 30, ప్రభాతవార్త

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ క్రీడా పోటీలను జన్నారం మండల కేంద్రములోని జెడ్‌పిఎచ్‌ఎస్‌బాయ్స్ స్కూల్ నందు మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కోసం ఉదయం పది గంటలకు జన్నారం ఎంపిడివో షరీఫ్, ఎమ్మార్వో రామ్మోహన్, ఎఎంసి ఛైర్మన్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు క్రీడాకారులు సిఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని తద్వారా జరిగే జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు ఇందులో చూపిన ప్రతిభ వల్ల అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిడి, పిఈటీలు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత వోల్వో ఆపరేటర్ శిక్షణ

మందమర్రి, జనవరి 30, ప్రభాతవార్త

సింగరేణి ప్రభావిత గ్రామాలు, సింగరేణి కార్మిక కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉచితంగా వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణను అందించనున్నట్లు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, భారీ మోటార్ వాహన (హెవీ మోటార్ వెహికల్) డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు కనీసం మూడు సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం కలిగి ఉండాలని ఆయన తెలిపారు. మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు మొత్తం 18 రోజులపాటు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణకు మొత్తం 60 మంది అభ్యర్థులను ఎంపిక చేయనుండగా, ప్రతి ఏరియా నుంచి అర్హత కలిగిన ఐదుగురిని ఎంపిక చేసి శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విలువైన అవకాశాన్ని సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జీఎం కోరారు. శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం మందమర్రి ఏరియా ఎంవీటీసీ కార్యాలయంలో మేనేజర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట, జనవరి 30, ప్రభాతవార్త

సీఎం కప్ 2026 రెండవ ఎడిషన్ లక్సెట్టిపేట మండల స్థాయి రూరల్ పోటీలు ఫిబ్రవరి 2న దౌడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరుగుతాయని మండల ఎంపీడీఓ కే. సరోజ, తహసిల్దార్ దిలీప్ కుమార్, మండల విద్యాధికారి, ఎస్సై గోపతి సురేష్ తెలియజేసారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ… ఈ పోటీలు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ నందు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జరుపబడునని తెలిపారు. మండల గ్రామ పంచాయతీ పరిధిలో గల క్రీడాకారులు తమ యొక్క ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ఫామ్‌తో ఫిబ్రవరి 2వ తారీఖు ఉదయం 9 గంటలకు హాజరు కాగలరు. అదేవిధంగా ఎంపిక కాబడిన క్రీడాకారులు నియోజకవర్గం స్థాయి పోటీల లో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సెక్రెటేరీలు రిజిస్ట్రేషన్ చేసుకోబడిన క్రీడాకారులను సమయానికి వచ్చేవిధంగా చర్యలు తీసుకోగలరు. వివరాలకు పాఠశాల వ్యాయామఉపాధ్యాయుడు కార్తీక్ పిడి (7989886085)కు సంప్రదించగలరు. మండలంలో గల అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

## చెన్నూరులో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం

చెన్నూరు రూరల్, జనవరి 30, ప్రభాతవార్త

చెన్నూరు మున్సిపాల్టీలో నామినేషండ్ల పర్వానికి చివరి రోజైన శుక్రవారం రోజున నామినేషన్ల కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరి రోజు నామినేషన్లు దాఖలు చేసేందుకు వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు తమ అనుచర వర్గంతో పెద్ద సంఖ్యలో రావడంతో నామినేషన్ కేంద్రం పరిసర రోడ్లన్నీ ప్రజలతో నిండిపోయాయి. దీంతో కేంద్రంవద్ద ప్రజలు గుమిగూడకుండ ఉండేందుకు వంద మీటర్ల దూరం వరకు ఇతరులను ఎవరినీ అనుమతించవద్దనే నిబంధనల కారణంగా పోలీసులకు బీఆర్ఎస్ నాయకుల మధ్య కొంత మేర వాగ్వాదం చోటు చేసుకుంది. మున్సిపాలిటీలోని 14వ వార్డుకి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు ఇతరులకు ఎలా అనుమతి ఇచ్చారు. మాకెందుకు ఇవ్వడం లేదంటూ పోలీసులను బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఒక న్యాయం మాకో న్యాయమా అంటూ నిలదీశారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ తరువాత గొడవ సద్దుమునగడంతో చివరి రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

# మంచిర్యాల అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

- 32వ డివిజన్ నుంచి పార్టీలో చేరిన యువత
- కండువా కప్పి ఆహ్వానించిన కొక్కిరాల సురేఖ



నస్పూర్, జనవరి 30, ప్రభాతవార్త

మంచిర్యాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌కు చెందిన పలువురు యువ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకుడు ధర్ని మధుకర్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కొక్కిరాల సురేఖ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొంగల నరసింహారెడ్డి, బేర రవి, బేర రాము, బేర లక్ష్మణ్, గోపతి సతీష్, సుధాకర్ రావు, అజయ్, అరుణ్ కుమార్ సహా ఇతర యువకులు రాము. నియోజకవర్గంలో జరుగుతున్న మార్పును చూసి యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం శుభపరిణామమని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా కాంగ్రెస్ బలోపేతం అవుతోంది. కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే నాయకత్వాన్ని ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారని కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు.

## సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

### మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జనవరి 30, ప్రభాతవార్త



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఏర్పాటు చేసిన 265 పోలింగ్ కేంద్రాలకు గాను 265 మంది పిఒలతో పాటు 20 శాతం అదనంతో 53 మంది రిజర్వ్ పిఒలు, 265 మంది ఎపిఒలతో పాటు 20 శాతం అదనంతో 53 మంది ఎపిఒలు, 795 మంది ఓపిఒలతో పాటు 20 శాతం అదనంతో 159 మంది ఓపిఒలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో ఏర్పాటు చేసిన 68 పోలింగ్ కేంద్రాలకు గాను 68 మంది పిఒలతో పాటు 20 శాతం అదనంతో 14 మంది రిజర్వ్ పిఒలు, 68 మంది ఎపిఒలతో పాటు 20 శాతం అదనంతో 14 మంది ఎపిఒలు, 204 మంది ఓపిఒలతో పాటు 20 శాతం అదనంతో 41 మంది ఓపిఒలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో ఏర్పాటు చేసిన 36 పోలింగ్ కేంద్రాలకు గాను 36 మంది పిఒలతో పాటు 20 శాతం అదనంతో 7 మంది రిజర్వ్ పిఒలు, 36 మంది ఎపిఒలతో పాటు 20 శాతం అదనంతో 7 మంది ఎపిఒలు, 108 మంది ఓపిఒలతో పాటు 20 శాతం అదనంతో 22 మంది ఓపిఒలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో ఏర్పాటు చేసిన 45 పోలింగ్ కేంద్రాలకు గాను 45 మంది పిఒలతో పాటు 20 శాతం అదనంతో 9 మంది రిజర్వ్ పిఒలు, 45 మంది ఎపిఒలతో పాటు 20 శాతం అదనంతో 9 మంది ఎపిఒలు, 135 మంది ఓపిఒలతో పాటు 20 శాతం అదనంతో 27 మంది ఓపిఒలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో ఏర్పాటు చేసిన 15 పోలింగ్ కేంద్రాలకు గాను 30 మంది పిఒలతో పాటు 20 శాతం అదనంతో 6 మంది రిజర్వ్ పిఒలు, 30 మంది ఎపిఒలతో పాటు 20 శాతం అదనంతో 6 మంది ఎపిఒలు, 90 మంది ఓపిఒలతో పాటు 20 శాతం అదనంతో 18 మంది ఓపిఒలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. సిబ్బంది తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం

### ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

### 60 డివిజన్ల అభ్యర్థుల ప్రకటన

మంచిర్యాల, జనవరి 30, ప్రభాతవార్త

రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే ఈ ఎన్నికల్లో పార్టీకి పట్టం కడతాయి" అని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల అభ్యర్థుల పేర్లను శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన అధికారికంగా ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం భారీగా పెంచాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్పొరేషన్ అధికార పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నూతన పాలక మండలి ఏర్పాటుతో నగరాన్ని మరింత ప్రగతి పథంలోకి నడిపిస్తామని వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ నిధులు తీసుకువస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పట్టణంలో 2 వేల పడకల ఆసుపత్రిని నిర్మించడం తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ సౌకర్యంతో ప్రజలు విద్య, వైద్యం కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. గుడిపేట ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద జాతీయ స్థాయి చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పుస్తకంలో మొదటి పేజీలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఫోటో ముద్రించడం మన అభివృద్ధికి నిదర్శనమని గుర్తు చేశారు. మంచిర్యాల పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం అని ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు. అభ్యర్థుల విజయం కోసం అంతా సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కార్పొరేటర్ అభ్యర్థులు, నాయకులు, మహిళా విభాగం, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సింగరేణి ఆధ్వర్యంలో ఆర్.కె.1ఏ సమ్మక్క సారాలమ్మ జాతర

రామకృష్ణాపూర్, జనవరి 30, ప్రభాతవార్త

రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్.కె.1ఏ భూగర్భ గని సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో పాల వాగు ఒడ్డున గత 40 ఏండ్లుగా ప్రతి రెండేళ్లకోసారి సింగరేణి యాజమాన్యం సమ్మక్క సారాలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తుంది. మంగళవారం కంక వన ప్రతిష్టాపనతో ప్రారంభమై, బుధవారం సారాలమ్మ గద్దెను చేరుకోగా, గురువారం సమ్మక్క తల్లి గద్దెకు చేరుకోవడంతో జాతర మహా ఘట్టానికి చేరుకొంది. అమ్మవార్లను దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో తమ మొక్కులు చెల్లించు కుంటూ సల్లంగా సూడు సమ్మక్క తల్లి అంటూ వేడుకుంటు ఇంటి బాట పట్టారు.